క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 60వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అభిరామ్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అభిరామ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. అభిరామ్ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. స్థానిక నాయకులు బల్లం కిషోర్, దాసం దుర్గారావు, అన్నపురెడ్డి రామిరెడ్డి, ఫణి, హరియాదవ్, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మొగల్రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నిమ్మతోట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శివాలయం వీధి, రావిచెట్టు సెంటర్, దాసరి లింగయ్య వీధి, ఇజ్జాడ అప్పలనాయుడు వీధి, 6వ డివిజన్ కొండ ప్రాంతం, బ్రహ్మానందరెడ్డి నగర్ కొండ ప్రాంతం, మెట్రో సెంటర్, రిలయన్స్ సెంటర్, రామనాథం వీధి, కృష్ణారావు వీధి, కడియాల వారి వీధుల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

7న ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రుద్రాభిషేకం, అలంకార అర్చన, హారతి మంత్రపుష్ప తీర్థప్రసాదాల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

రైలు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కోరమాండల్ రైలు ప్రమాద బాధితుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా వారు ఎవరైనా ఉంటే వారికి అండగా ఉంటామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రయాణికుల సమాచారం తెలుసుకునేందుకు తన పర్సనల్ నంబర్ 98481 44399లో సంప్రదించాలని సూచించారు. ఏ సమయంలోనైనా ఈ నంబర్‌కి కాల్ చేయవచ్చని.. స్పందించేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే చెప్పారు. ఎమర్జెన్సీ సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. జిల్లాల్లో ఆస్పత్రులను అలర్ట్ చేశామని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు మరింత వేగవంతం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సేవలు ఇక నుంచి నగర పౌరులకు మరింత వేగంగా అందనున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. నగరంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బీఎస్ఎన్ఎల్ టవర్‌ను శనివారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పరిజ్ఞానం ద్వారా 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రి నుంచి 5 నుంచి 8 కిలో మీటర్ల పరిధి వరకు ఈ సేవలు మరింత వేగంగా పని చేస్తాయని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వస్తున్న రోగులకు, వారి బంధువులకు, బీఎస్ఎన్ఎల్ సేవలు ఎక్కువగా వినియోగిస్తున్న పోలీస్ శాఖకు నూతన పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొబైల్ డేటా వేగంలో కూడా గణనీయమైన మార్పు వస్తుందని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వినియోగదారులకు సేవలు అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.సురేష్ కృష్ణ, ఉమ్మడి కృష్ణా జిల్లా జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్, డీజీఎం ఉమామహేశ్వరరావు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో నూతన వెలుగులు

- రాష్ట్ర దశ, దిశను మార్చిన ఘనత జగనన్నదే
- గడప గడపకు మన ప్రభుత్వంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలతో ప్రతి ఇంటా నూతన వెలుగులు ప్రసరింప చేయటంతో పాటు రాష్ట్ర దశ, దిశను మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్ 204వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండలరావుతో కలిసి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరున పలకరిస్తూ, స్థానిక సమస్యలపై అన్ని శాఖల అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. దేశంలో ఏ రాష్ట్రం కానీ, ఏ పార్టీ నేతలు కానీ గడప గడపకు వెళ్లిన దాఖలాల్లేవని. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నందునే ప్రజాప్రతినిధులు గడప గడపకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

గడప గడపకు సంక్షేమం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్య వైద్యాన్ని అందిస్తున్నామని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తమ కుటుంబాలకు ఆరోగ్య భద్రత లభించిందని ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. చంద్రబాబు పాలనలో వైద్య ఆరోగ్యశాఖపై వెంటిలేటర్‌పై ఉండేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ శాఖకు జీవం పోశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లు మాత్రమే ఉండేవని.. ఈ ప్రభుత్వంలో ఏకంగా 3,118 ప్రొసీజర్లకు పథకం వర్తింపచేస్తున్నట్లు పేర్కొన్నారు. నాడు - నేడు పథకం కింద ఆస్పత్రుల రూపురేఖలు మార్చడం కోసం అక్షరాలా రూ.16,255 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి.. వైద్య సేవలను మరింత చేరువ చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ప్రత్యేక హోదాను తుంగలో తొక్కింది చంద్రబాబే

దేశంలోని ముఖ్యమంత్రులు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి వైపు చూస్తుంటే చంద్రబాబు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. సీఎం జగన్‌పై మంగళగిరిలో ప్రతిపక్షనేత చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అసలు రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించడానికి ప్రధాన కారణం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం కాదా..? అని ప్రశ్నించారు. ఒక్క చంద్రబాబు తప్పితే రాష్ట్రం విడిపోవాలని ఎవరూ కోరుకోలేదన్నారు. లేఖ ఇచ్చి మరీ రాష్ట్ర విభజనకు కారణమయ్యారని దుయ్యబట్టారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీ అమలు కాకపోవడానికి కూడా చంద్రబాబు అసమర్థతే ప్రధాన కారణమని మల్లాది విష్ణు నిప్పులు చెరిగారు. ఐదేళ్ల పాటు కేంద్రంలోని బీజేపీతో అధికారాన్ని పంచుకుని కూడా పోలవరాన్ని పూర్తిచేయలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు కోరడంతోనే జాతీయ హోదా కలిగిన పోలవరం రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లోకి వచ్చి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. కార్యక్రమంలో డీఈలు గురునాథం, రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న బుడమేరు ప్రక్షాళన

- దోమలు తగ్గుముఖం
- నిరంతరాయంగా దోమల నివారణ చర్యలు



బుడమేరులో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమలకు ఆవాస కేంద్రంగా మారిన బుడమేరు ప్రక్షాళన సత్ఫలితాలు ఇస్తున్నాయి. నగర మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశానుసారం బుడమేరులో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. నిరంతరాయంగా చర్యలను తీసుకోవటంతో పాటు నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగిస్తున్నారు. దీంతో దోమలకు నిలయంగా ఉండే రామకృష్ణాపురం, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్, బసవతారకనగర్, అయోధ్యనగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో దోమలు తగ్గుముఖం పట్టాయి.

గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో బుడమేరు తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అలాగే రామకృష్ణాపురం వద్ద బుడమేరులో టీడీపీ నేతల ఆక్రమణలతో నీటి ప్రవాహం నిలిచిపోయేది. నీటి ప్రవాహం నిలిచిపోవటం వల్ల గుర్రపుడెక్క పేరుకుపోయి దోమలు మరింత పెరిగిపోయాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర పాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు దోమల నివారణ చర్యలు చేపట్టారు.

గుర్రపు డెక్క తొలగింపు

బుడమేరులో భారీగా పెరిగిపోయిన గుర్రపుడెక్కను జేసీబీ సాయంతో తొలగించారు. అలాగే బోట్‌లను ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెత్తచెదారం తొలగించారు. ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపుడెక్క రాకుండా మెస్‌లను ఏర్పాటు చేశారు.

డ్రోన్లతో ఎంఎల్ ఆయిల్ స్ప్రే

బుడమేరులో దోమల నివారణకు వినూత్నంగా డ్రోన్ల సహాయంతో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తున్నారు. అలాగే మురుగు కాలువలు, బుడమేరులో నీటి ప్రవాహం నిలిచిపోకుండా నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. బుడమేరులో ప్రతి రోజు చెత్తచెదారం తొలగించేందుకు మలేరియా విభాగం, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యాన బృందాలను ఏర్పాటు చేశారు. బుడమేరులో పెరిగిపోయిన చెట్లు కొమ్మలు, చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అలాగే బుడమేరులో బోట్ సహాయంతో ప్రతి రోజు చెత్తను తరలిస్తున్నారు.

చురుగ్గా అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులు



గ్రానైట్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని స్వరాజ్యమైదానంలో చురుగ్గా సాగుతున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. విగ్రహానికి సంబంధించిన డిజైనర్స్‌తో పాటు గ్రానైట్, మార్బుల్స్ డిజైన్లను పరిశీలించారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా విగ్రహ నిర్మాణ పనులు పూర్తి కావాలని డిజైనర్స్‌ను ఆదేశించారు. అంబేడ్కర్ విగ్రహం కింద కారిడార్‌లో గ్రానైట్‌తో ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కారిడార్‌ను ల్యాండ్‌స్కేప్‌తో తీర్చిదిద్దాలని సూచించారు. అంబేడ్కర్ స్మృతివనం ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ అద్భుత ప్రాజెక్ట్ పనులను అత్యంత జాగ్రత్తగా చేస్తూ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం జరగాలని సూచించారు. ముందుగా అనుకున్న సమయంలోపు ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కమిషనర్ ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



దుర్గాపురంలో మజ్జిగ అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని తోటివారికి చేతనైన సాయం చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక ముత్యాలంపాడులో శనివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని వాహన చోదకులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. 1,500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 28వ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండలరావు, ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, హేమంత్‌రావు, సాయి పాల్గొన్నారు.

దుర్గాపురంలో..

దుర్గాపురంలో బీఆర్టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. 500 మందికి మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణను జోనల్ కమిషనర్లు పర్యవేక్షించాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులకు డివిజన్ ప్లాన్‌ను వివరిస్తున్న కార్పొరేటర్ అప్పాజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జోనల్ కమిషనర్లు ప్రతి రోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. 53వ డివిజన్ పరిధిలోని జెండా చెట్టు సెంటర్, డ్రెయిన్ వీధి, గణపతిరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో శనివారం అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా రోడ్లు, డ్రెయిన్లలో మురుగునీటి పారుదల విధానాన్ని పర్యవేక్షించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ మహదేవు అప్పాజీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. డివిజన్‌ను అభివృద్ధి పరచటంలో భాగంగా అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టాలి..

ఈ పర్యటన ద్వారా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రధాన సమస్యలకు కమిషనర్ చర్యలు చేపట్టారు. డ్రెయినేజీలను, ముఖ్యంగా వర్షం కురిసిన సందర్భంలో జెండా చెట్టు సెంటర్, డ్రెయిన్ వీధి, గణపతిరావు రోడ్డు ఏరియాల్లో సైడు డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్లలో వర్షపు నీరు లాగకపోవడం వలన స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లోని సైడ్ డ్రెయిన్ల ద్వారా మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, పాడైపోయిన డ్రెయిన్లకు తగిన మరమ్మతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి, ప్రజారోగ్య శాఖ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి (భూమిపుత్ర) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్డులోని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయం ఆవరణలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, డెంటల్, కార్డియాలజిస్ట్ సంబంధిత వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైలు ప్రమాదానికి కేంద్రానిదే బాధ్యత

ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి పోలారి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఒడిశా రాష్ట్రంలో బాలాసోర్ వద్ద జరిగిన రైళ్ల ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఒడిశా రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి శనివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేటీకరిస్తూ కాంట్రాక్టీకరణ, ఉద్యోగుల కుదింపు చర్యలకు పాల్పడటం ఇలాంటి ప్రమాదాలకు కారణం అవుతోందని ఆరోపించారు. ప్రయాణికుల నుంచి లక్షల కోట్ల రూపాయలు దండుకుంటూ కనీస వసతులు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర నాయకులు కె.వి.రమణ, రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ, విజయవాడ నగర కార్యదర్శి కె.దుర్గ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాలు కలుషితం కాకుండా చూడాలి



కృష్ణానదిని శుభ్రం చేస్తున్న నలంద ఎన్‌సీసీ క్యాడెట్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నదీ జలాలను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణానదిలో కృష్ణవేణి ఘాట్ వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనూరాధ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కాలుష్యం వలన పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, వాతావరణ మార్పులు సంభవిస్తాయని చెప్పారు. గాలి, నీరు, నేల కలుషితం కాకుండా చూడాలన్నారు. నదీ జలాల కాలుష్యం వలన దిగువ ప్రాంత ప్రజలు ఆ నీటిని తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నదుల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ ఏఎన్‌ఓ షేక్ రఫియాబేగం, క్యాడెట్లు పాల్గొన్నారు.

కరుణానిధి సేవలు చిరస్మరణీయం



కరుణానిధి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కనకారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ద్రవిడ ఉద్యమ నేత, రాజకీయ దురంధరుడు ముత్తువేల్ కరుణానిధి సేవలు చిరస్మరణీయమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు అన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రానికి ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా తమిళ చిత్రపరిశ్రమలో రచయితగా, నటుడిగా ప్రజల ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) పార్టీకి ఐదు దశాబ్దాల పాటు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న ఘనత కరుణానిధిదే అన్నారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్, సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.బ్రహ్మేశ్వరరావు, నాయకులు అన్నవరపు బ్రహ్మయ్య, దాలిపర్తి ధన్వంతరి, కాపవరపు నాగ సుధాకర్, పావులూరి రాంప్రసాద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జన్ భాగ్‌ధారీని విజయవంతం చేయండి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో 'జన్ భాగ్‌ధారీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంయుక్త భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ఫౌండేషన్ లిటరసి న్యూమరసి కార్యక్రమం చేయాలని పేర్కొన్నార. ప్రతి మండలం నుంచి బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేయాలని, పాఠశాల స్థాయి అనంతరం మండల స్థాయిలో దృశ్య శ్రవణ పరికరాలను ఉపయోగించి బోధనోపకరణాలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల ఆరో తేదీన జిల్లా స్థాయి జన్ భాగ్‌ధారీ కార్యక్రమం ఉంటుందని వివరించారు.

భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి పునాది ఆదిశంకరులు

విజయవాడకల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి పునాది జగద్గురువులు ఆదిశంకరులని శృంగేరీ శివగంగ పీఠాధిపతులు పురుషోత్తమ భారతీ మహాస్వామి తెలిపారు. విజయాత్రలో భాగంగా శివరామకృష్ణ క్షేత్రంలో విడిదిచేసిన స్వామి శనివారం భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఆదిశంకరులు ధర్మరక్షణ కోసం అనేక గ్రంథాలను రచించారన్నారు. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, సంస్కృతి సంప్రదాయాలు భారతీయ ఆత్మ అని వాటిని కాపాడుకోవాలని, ధర్మరక్షణకు కృషి చేయాలని సూచించారు. శృంగేరీ శివగంగ పీఠం, శృంగేరీ శారదాపీఠం సంప్రదాయ పరిరక్షణకు కృషి చేస్తునట్లు స్వామిజీ తెలిపారు. స్వామి శారదా చంద్రమౌళీశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించిన పూజాదికాలను పర్యవేక్షించారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం వేద సభను నిర్వహిస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా పురాణం మహేశ్వరశర్మ శ్రీభాగవతంలో శ్రీకృష్ణ లీలలు అంశంపై ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.